ద్రోహం జెయ్యడమేంది. నేనెవరికి ద్రోహం చేసినానురా" అన్నాడు రెడ్డి.

"నువ్వు ఒక పార్టీ వాండ్ల ఓట్లతో గెలిచి ఇంకో పార్టీలో చేరడం అంటే ఓటర్లందరికీ ద్రోహం చెయ్యడం గాదా" అన్నాడో యువకుడు.

"ఏందీ? అది ద్రోహం ఎట్లా అవుద్ది? నన్ను ఇదే పార్టీలో వుండమని గాని, అవతలి పార్టీలో చేరొద్దని గానీ ఏ ఓటరూ నన్ను కోరలేదు, నేను వాండ్లకు మాటియ్యాలేదు. పాపం వాండ్లకు ఈ పార్టీలూ, రాజకీయాలూ ఇన్నేందెలుసున్రా. నాకు వోట్లుగావాల. వాండ్లకు డబ్బులు గావాల. ఓటుకింత అని ప్రతివాడికీ డబ్బులు పంచినా. ఇదే సమయమని వోటర్లు గూడ వాండ్ల రేటును పెంచినారు. చచ్చినట్లు వాండ్లందరికీ పెంచిన రేట్ ఇచ్చినా. తాగినోళ్లందరికీ సారాకు సారా, కల్లుకు కల్లూ బోయించినా. కొంతమంది బ్రాందీలూ ఇస్కీలూ గావాలంటే కేసులక్కేసులు దెప్పించి యాదికో కేసు లెక్కన బంచినా. మా ఆడోళ్లు ఇంటింటికీ దిరిగి ఆడోళ్లందరికీ బొట్లు పెట్టి ఇంటికో స్టీలు బింది పంచొచ్చిరి. లేబరోండ్ల ఆడోళ్లకు స్టీలు బిందెల్తోపాటు చీరలూ, రవికలూ ఇచ్చొచ్చిరి. రెండు మూడు గ్రాముల బంగారంతో మంగళ సూత్రాలు జేయించి కొంతమంది ఆడోళ్లకు పంచి పెట్టిస్తి. కొంతమంది ఆడోళ్లు పిల్లోళ్లనూ, మొగుళ్లనూ వొదిలి ఆ పదిరోజులూ నా జీపులో ఎక్కి ఊళ్లో ఆడోళ్లల్లో ప్రచారం చేసినందుకు ఏడెనిమిది నెక్లెసులు కర్చాయ. అసలు నాకు టిక్కెట్టు రావడానికి ఎంత కర్చయిందో తెలుసా? పొద్దుస్తేస్తే నీతికథలు చెప్పే పెద్ద పెద్ద నాయకులకూ, వాండ్లకూ మాకూ మధ్య బ్రోకరు పనిజేసే జిల్లా ఇన్‌చార్జి లీడర్లకూ వాండ్ల వాటా వాండ్లకు ముట్టకపోతే నాకు టిక్కెట్టొచ్చేదా? మరి ఇన్ని లక్షలు ఖర్చుచేసుకొని రాజకీయాల్లో నిలబడాలంటే- నేనేం ప్రకాశం పంతుల్ననుకుంటున్నారా ఏందిరా? ఇంట్లోంచి తీసుకపోయి నేను కర్చుపెట్టిన ఈ డబ్బంతా, అధికారం లేని పార్టీతో అంటకాగితే ఎట్లా వొచ్చుద్ది?- మీరంతా నా వాళ్లుగాబట్టి ఈ సంగతులన్నీ చెప్పగూడనివైనా, మీకు జెబ్తున్నాగాని, అసలు దేశంలో ఈ దందా జెయ్యకుండా పదవిలోకొచ్చిన వాడు ఒక్కడి పేరు జెప్పండి" అని తన రాజకీయ విశ్వరూపాన్ని స్పష్టంగా ప్రదర్శించాడు వెంకటస్వామిరెడ్డి.

"కానీ ఓటర్లు మిమ్మల్ని క్షమించరు. నిన్ను నిలదీస్తారు" అన్నాడు మరో యువకుడు.

"ఓరి పిచ్చోడా! ఓటర్లు వోటర్లని ఒకటే వొర్లుతున్నారు. ఎవుర్రా ఈ వోటర్లు. ఏ వోటరైతే డబ్బుల్తీసుకొని వోటేస్తాడో, మందుకూ విందుకూ కక్కుర్తిపడి వోటేస్తాడో- ఆ వోటరుకు నోరు తెరిచే హక్కు లేదు. డబ్బుల్తీసుకున్నారు- ఓటేసినారు. ఆ లావాదేవీ అంతటితో చెల్లు. ఈ వోటర్ల సంగతి మీ కంటే నాకు బాగా దెలుసుగాని మీరేం ఆయాసపడకండి. అన్నట్టారే మీకు ఉద్యోగం సద్యోగం లేకపోతే ఇట్టాంటి ఆలోచనలే వొస్తుంటాయి గాని, ఇప్పుడు మన పార్టీ పెత్తనంలో వుంది గదా, చిన్నదో పెద్దదో ఒక ఉద్యోగం వేయిస్తాగాని రేపు హైదరాబాదు పోతుండా మీ సర్టిఫికెట్లు దీస్కొని రండి. ఏదన్నా ప్రయత్నం జేద్దాం. అన్నట్టు ఇంట్లో వాండ్లనడిగి కాస్తో కూస్తో డబ్బుల్దీసకరండి- కర్చులగ్గావాలగదా" అని లేచాడు వెంకటస్వామిరెడ్డి. ■

# అందని ఆకాశం

-కె.వాసవదత్త రమణ

అటెండరు తలుపు తీసుకుని వినయంగా ఫైల్సు తెచ్చి టేబుల్ మీద పెట్టాడు!

సుమలత ఒక్కొక్క ఫైలు తీసి స్టడీ చేయడం మొదలు పెట్టింది. "మేడమ్! ఉద్యోగంలో చేరిన మొదటి రోజూ సీరియస్‌గా పని మొదలుపెట్టేసారు!" అటెండరు మనసులో అనుకుంటూ బయటకు వెళ్లాడు!

ఇంతలో ఫోను మోగింది! ఫోను మాట్లాడుతూ బజర్ నొక్కింది సుమలత!

"ఆ అయిపోయిందా? టెండర్ ఫైనల్ చేశాం!" మాట్లాడుతూనే అటెండరు లోపలికి రాగానే ఫైల్సు పట్టుకెళ్లమని సైగ చేసింది!

టేబిల్ క్లియర్‌గా ఉంటేనే ఆమెకిష్టం! వర్కు పెండింగ్ ఉంటే ఆమెకు నచ్చదు! చాలా 'డిసిప్లేన్ ఆఫీసురు'గా ఆమెకు మంచి రికార్డు ఉంది!

"అరే! ఈ ఫైలు చూడలేదే!" అనుకుంటూ ఓ పక్కగా ఉన్న ఫైలు చేతుల్లోకి తీసుకుంది సుమలత!

ముత్యాల్లాంటి అక్షరాలు, అవే అక్షరాలు, అదే వ్రాత! ఆమె గుండె వేగంగా కొట్టుకుంది! ఆ అక్షరాల వెంట ఆమె కళ్లు రేసు గుర్రాల్లా పరుగుతీసాయి! ఆమె మనస్సంతా ఉద్వేగంగా, ఉద్రేకంగా మారింది!

"నన్ను నేను మరచిపోగలను కాని, ఆ అక్షరాలని, ఆ అక్షరాలకి రూపం ఇచ్చిన ఆ మనిషిని ఎప్పటికయినా మర్చిపోగలనా!" బేలగా ప్రశ్నించుకుంది తన మనసు!

కళ్లలోకి తెలియకుండానే చెమ్మ చేరింది! చాలా సేపటివరకు అచేతనంగా అలాగే కూర్చుండి పోయింది. మళ్లీ నమ్మకం కుదరక కింద సంతకం వంక చూసింది! అదే సంతకం!

ఒక్క పది నిముషాలకి తేరుకుని, యాంటీ రూమ్‌లోకి వెళ్లి రిలాక్స్ అయ్యింది, ముఖం కడుక్కుని!

మళ్లీ వచ్చి తన రూమ్‌లో కూర్చుంది! పది నిమిషాల క్రితం టీనేజి పిల్లల్లా తను పడ్డ టెన్షను గుర్తుకు వచ్చి ఆమె పెదాలపై చిరునవ్వు విరిసింది!

"రఘు!" ఆ ఫైలు మీద సంతకం మీద ఆమె వేళ్లు కదలాడుతుంటే ఆమె మనస్సు గతంలోకి పరుగు తీసింది!

❖ ❖ ❖

"రఘు!" వెన్నెల్లాంటి చిరునవ్వుతో సుమలత పరుగెత్తుకుంటూ వచ్చింది.

"రఘు!" నేను టెన్తు ఫస్టు క్లాసులో పాసయ్యాను! ఆమె కళ్లలో ఆనందపు మెరుపులు!

"అబ్బా! దానికేనే ఇంత హడావుడి" రఘు వెక్కిరింతగా అన్నాడు! ఆమె ముఖం చిన్నపోయింది.

"నువ్వెప్పుడు ఇంతే! ఎవ్వరికి చెప్పకుండా నీకే మొదటగా చెబుదామని వస్తే...!" కోపం తన్నుకొచ్చింది సుమకి!

"జయ! సుమా! ఓకే! కంగ్రాట్స్! సరేనా!" నవ్వుతూ అన్నాడు!

అతని నవ్వుని, మెరుస్తున్న పలు వరస వంక అలాగే చూస్తూ ఉండిపోవాలనిపించింది సుమకి!

"సుమ! సాయంత్రం సినిమాకి! పార్టీ ఇస్తావా మరి!" అంటూ బుగ్గలు పట్టుకుని సాగతీసాడు!

కళ్లెత్తి చూసి నవ్వి, అతని చేతులు మృదువుగా విడిపించుకుని 'అలాగే' అంటూ పరుగెత్తింది!

"ఏమిటో, సుమ దగ్గరున్నంత సేపు కవ్వించాలని, బాగా ఏడిపించాలని అనిపిస్తుంది, తను బాధపడి వెళ్లిపోతే మళ్లీ మనస్సంతా శూన్యంగా అనిపిస్తుంది!" అనుకున్నాడు రఘు!

ఇద్దరివీ పక్క పక్క ఇళ్లు కావడంతో - కలిసే పెరిగారు! రఘు నలుగురు ఆడపిల్లల తర్వాత పుట్టడం వల్ల అతనంటే ఇంట్లో అందరికీ అపురూపం! మగ పిల్లాడని అమిత గారం!

"నీకేంరా మగ మహారాజువి" అనే భావంతో - అందరూ అదే అనడంతో బలపడి అతనిలో తెలియకుండానే పురుషాహంకారం అప్పుడప్పుడు స్పష్టంగానే బయటపడుతుంది!

❖ ❖ ❖

ఎర్రటి లంగా, జాకెట్టు, తెల్లటి ఓణిలో మెరిసిపోతున్న సుమని పదేపదే చూడాలనిపిస్తూనే ఉంది, రఘుకి సినిమాకి వెళ్లేవరకు!

థియేటర్ దగ్గర సుమలత ఫ్రెండ్స్ రాణి, శ్రీధర్, గోపాల్ కనిపించడంలో అతనిలో చిరాకు మొదలైంది.

సుమలత ఫ్రెండ్స్ అందరితో కబుర్లు చెబుతూ సినిమా ఎంజాయి చేసింది. రఘు గంటుముఖం పెట్టుకునే సినిమా చూశాడు! సుమ రెండు మూడుసార్లు పలకరించినా పలకలేదు. ఆమెకి అతని జెలసీ, కోపం అన్నీ తెలుస్తూనే ఉన్నాయి!

సినిమా అవ్వగానే అందరు ఎవ్వరి ఇళ్లకు వాళ్లు వెళ్లిపోయారు!

"రఘు! ఎందుకు కోపం! వాళ్లు నాకు ఫ్రెండ్స్ కదా!" అనునయంగా అందామె ఇంటికి దగ్గరగా వచ్చాక!

"అవును! నీకు అందరూ ఒక్కటే కదా!" విసురుగా అన్నాడు!

"సిల్లీగా మాట్లాడుతున్నావు!"

"సుమ! ఇంకెప్పుడు నన్నిలాంటి ప్రోగ్రామ్స్ పెట్టి పిలవకు!"

కఠినంగా అన్నాడు.

ఆమె కళ్లలో నీళ్లు తిరిగాయి!

"రఘు నీకెలా చెప్పాలి! నన్ను, నా మనస్సును ఎప్పుడు గ్రహించుకుని గెలుచుకుంటావు? ఎప్పుడు నీలో అభిజాత్యాన్ని పక్కకు పెట్టి నన్ను గుర్తిస్తావు!"

రఘు ప్రవర్తన ఆమెను బాగా గాయపర్చింది!

విడిపోయే ముందు, రఘు హఠాత్తుగా సుమకేసి తిరిగి, "సుమ! ఒక్కటి గుర్తుపెట్టుకో! ఈ ప్రపంచంలో నేను ఇష్టపడినట్టు ఇంకెవ్వరు - నిన్ను ఇష్టపడరు! అందరిలోను నన్నెప్పుడు కలపకు! బై!" ఇంట్లోకి వెళ్లిపోయాడు!

అతని మాటలకు ఆమెలో గూడు కట్టుకున్న బాధ తగ్గినట్టునిపించింది! చిరునవ్వుతో అతను వెళ్లిన వంకే చూస్తుండిపోయింది అతని రూపం కనుమరుగయ్యే

వరకు!

సుమని బస్టాపులో కలిసాడు రఘు కాలేజి నుంచి వస్తూంటే! ఇద్దరు కబుర్లు చెప్పుకుంటూ ఇంటి సందు మొదలువరకు వచ్చారు! అక్కడ రఘు అక్క కావేరి ఎవరో అబ్బాయితో మాట్లాడుతోంది నవ్వుతూ!

"కావేరి!" రఘు కోపంగా పిలిచాడు!

అతనికి బైచెప్పి పంపేసి, "ఏరా, ఇప్పుడే వస్తున్నావా కాలేజి నుంచి!" అంది!

"నా సంగతి సరే కాని, అతనెవరు? అతను నాతో పాటు బిఇడి ట్రైనింగ్ తీసుకుంటున్నాడు, పేరు రామకృష్ణ!"

"అలా రోడ్డుమీద నిలబడి మాట్లాడుకుంటే అందరూ ఏమనుకుంటారు?"

"అదేమిట్రా? అలా సిఐడిలా ఎంక్వైయిరీ చేస్తున్నావు? క్లాస్‌మేట్‌తో మాట్లాడుకుంటే తప్పా!"

"అదే చెబుతా! నాన్నతో చెబితే ఏది తప్పో నీకే తెలుస్తుంది!" వెటకారంగా అన్నాడు!

వాళ్లతోపాటు నడుస్తున్న సుమలతకి అతని ప్రవర్తన మింగుడు పడడం లేదు!" కావేరి అతని నాలుగో అక్క? ఆమె మీద ఇతని పెత్తనం ఏమిటి?" మరి అతను తనతో పాటే వస్తున్నాడుగా?"

రాత్రి చదువుతుంటే రఘు వచ్చి ఎదురుగా కూర్చున్నాడు ఇక ఆగలేక అడిగేసింది!

అంతా విని, తాపీగా

"సుమా! ఎన్నితరాలు గడిచినా, ఆడది ఆడదే, మగాడు మగాడే! మగాడు ఎన్ని తప్పులు చేసినా కవర్ అయిపోతాయి! అదే ఆడది ఒక్క తప్పు చేసినా, సమాజం వెలివేస్తుంది!"

హఠాత్తుగా సుమకి జీవితం అంటే భయం వేసింది? రఘు అంటే భయం వేసింది!

"మరి రఘు! అలా అంటే, నువ్వు, నేను! కావేరి లాగే కలిసే వస్తున్నాం ఇంటికి!" గొంతులో ఏదో అడ్డు పట్టినట్టయ్యింది ఆమెకి అలా అడగటానికి!

"సుమ! నీకు చాలాసార్లు చెప్పాను! మనిద్దరిది అపురూపమైన సంబంధం! నన్ను కాని, నా ఇష్టాన్ని కాని, నాలోని ప్రేమని కాని దేనిలోనయినా కంపేర్ చేయడం నాకు చాలా అసహ్యం!

సుమ కళ్లల్లోకి చూసి మెత్తగా చెబుతూ, చివర్న కఠినంగా అనేసి వెళ్లిపోయాడు!

నిశ్చేష్టురాలై అలాగే ఆలోచనగా కూర్చుండిపోయిందామె!

❖ ❖ ❖

"అమ్మా!" సుమా! నిన్నా, ఈవాళ రాలేదేం మన ఇంటికి!" తల్లిని అడిగాడు రఘు!

"జ్వరం రా రఘు! పిల్ల తోటకూర కాడలా వాడిపోయింది పాపం!" అందావిడ!

ఇక ఆగలేకపోయాడు రఘు! గబగబా సుమ ఇంట్లోకి వెళ్లాడు! మంచం మీద పడుకుని ఉందామె!

అతనికి బాధ వేసింది. తన్నలా చూసి! అరగంటైనా లేవలేదు!

'ఎదుట నీవే, ఎదలో నీవే' పేపరు మీద వ్రాసాడు! మళ్లీ చింపేసాడు!

"సుమ, సుమ!" అతనికి జ్వరంలో - ఆమెలా పడి ఉంటే అతని ప్రాణాలన్ని లాగేసినట్టు అనిపించింది!

కాసేపటికి లేచింది? ఎదురుగా రఘుని చూసి ఆమె కళ్లల్లో వెలుగు నింపింది!

"రఘు!" తెలియకుండానే అతని మెడ చుట్టూ చేయి వేసి అతన్ని హత్తుకుపోయింది!

"సుమా! నువ్వే నా ప్రాణం! నీకేం కాదు! తగ్గిపోతుంది!" వీపు మీద నెమ్మదిగా వ్రాస్తూ అన్నాడు!

'రఘు! ఐ లవ్‌యూ!" తీగలా అల్లుకుపోయింద తన్ని! ఆమె కళ్లలోకి చూస్తూ, "సుమా! ఐ లవ్ యూ!" అంటూ నుదుటి మీద ముద్దు పెట్టాడు!

❖ ❖ ❖

"మా పిన్ని కూతురు శైల!" సుమ ఉత్సాహంగా పరిచయం చేసింది! "ఢిల్లీలో ఉంటారు, సెలవలకి వచ్చారు!" అంటూ!

'హాయ్!' అంది శైల! హుషారుగా, ఫాస్ట్‌గా ఉంది! సన్నగా, మెరుపుతీగలా ఉందామె! శైల అందం రఘుని వెంటాడింది పదే పదే!

శైల ఉన్నచోట సముద్రపు హోరే! అందర్నీ అల్లరిలో ముంచేస్తుంది! కవ్విస్తుంది, నవ్విస్తుంది. రఘుకి తనున్న నెలరోజులు క్షణాల్లా గడిచిపోయాయి!

"నాగార్జునసాగర్ వెళదాం!" అన్నారు పిల్లలందరు! పెద్దవాళ్ళు ఓటేయ్యడంలో మిని బస్సు మాట్లాడుకుని అన్ని ఫ్యామిలీలు సరదగా బయలుదేరాయి!

"చూడవే సుమా! రఘు నాకేసి కన్ను కొడుతున్నాడు!" శైల నవ్వుతూ అంది! బోటు ప్రయాణంలో!

"అవును మరి, డెక్ మీదకు వస్తావా అంటే నేను రెడీ! అన్నాను" రఘు చిలిపిగా అన్నాడు. శైల వంక చూస్తూ!

సుమకి అతని ప్రవర్తన అర్థం అయి కానట్టుంది!" తనంటే పడి చస్తానంటాడు, శైలతో తిరుగుతాడు!' ఏమిటిది?

'భయం! నిజమా? తనలో అనుమానభూతం ప్రవేశిస్తోందా!' ఆమె మనసు డోలాయిమానంగా ఉంది!

"పద సుమా, పైకి వెళదాం!" ఆమె చేయిపట్టుకుని లేవదీశాడు రఘు!

"నేను రాను!" పెంకిగా అంది!

"సుమా! నువ్విలాఉంటే నాకు నచ్చదు. లైఫ్ చిన్నది! సరదగా హాయిగా గడపాలి! దా!" అంటూ పైకి, బోటు మీదకు తీసుకెళ్లాడు! బలవంతంగా!

అయిష్టంగా వచ్చింది సుమ! అక్కడ శైలతో కబుర్లు, నవ్వులతో ఆమెను - ఇద్దరు మర్చిపోయారు! అది ఆమెను మరింత బాధపెట్టింది.

రాత్రి నిద్ర పట్టక అటు ఇటు దొర్లుతూనే ఉంది సుమ కాటేజిలో! అందరూ వరసగా పడుకున్నారు! చిన్నగా చప్పుడు వినిపించిందామెకు!

లేచి కూర్చుని చూసింది? ఏమీ లేదు? బయటకు వచ్చి కారిడార్‌లో నిలబడింది. ఓ మూలగా ఏదో కదిలినట్టనిపించింది!

పరికించి చూసి నిర్ఘాంతపోయింది! తన కళ్లను తానే నమ్మలేక పోయింది! రఘు కౌగిలిలో శైల! ఇద్దరు హత్తుకుపోయి ఈ లోకంలోనే లేరు!

కోపంతో ఉడికిపోతూ

"శైలూ!" అంది!

అంతే! ఇద్దరు విడిపోయారు కంగారుగా! శైల పరుగెత్తుకుంటూ లోపలికి వెళ్లి దుప్పట్లో ముసుగేసి దొంగలా పడుకుంది!

రఘు కొంచెం సర్దుకుని!

"సుమా! జస్ట్ ఫన్! అంతే! అంతకన్నా మరేం లేదు!" తేలిగ్గా అన్నాడు!

"ఛీ! నువ్వింత దిగజారిపోతావని ఎప్పుడు అనుకోలేదు!" సుమ కళ్లల్లో నిప్పులు కురుస్తున్నాయి!

"సుమా! టేకిట్ ఈజీ! ఆడది మీద పడుతుంటే వద్దనేటంత మూర్ఖుడ్ని కాను! అయినా నా లిమిట్స్ నాకు తెలుసు" నిర్లక్ష్యంగా అన్నాడు!

"సుమా! నీస్థానం ఎప్పటికీ చెక్కు చెదరదు!" మళ్లీ అతనే అన్నాడు!

"కాని నా దృష్టిలో నీకసలు స్థానమే లేదికనుంచి! సరదాకో ఆడది, పెళ్లికో ఆడది - నువ్వు రెండు తలల మొగాడివి? ఐ హేట్ యూ!"

సుమలతకి దుఃఖం ఆగలేదు! అతని ముఖంలో నెత్తురు చుక్కలేదు!

❖ ❖ ❖

గతం నుంచి వర్తమానంలోకి వచ్చింది సుమలత!

## అబద్ధాలకేక్ జీవితం

బండెడు అబద్ధాలతో చేసిన
కేక్ మధ్యలో పొదిగిన వొకటో రెండో
ఎర్రని పళ్ళులా మెరుస్తోన్న జీవితాన్ని చూసి
నేనెప్పుడూ మోసపోను
అదే జీవితమని ఎప్పుడూ అనుకోను.
జీవితాన్ని శిలువలా మోస్తున్న
వాడి దగ్గరకు పరిగెత్తి పాదాభివందనం
చేసి వాడి నుదుటి చెమట చుక్కను
కళ్ళకద్దుకొని జీవితానికి
అర్థం చెప్పు బాబూ అని అర్థిస్తాను
ఎక్కడో ఏదో యిస్తున్నారంటె
గుండెలవిసేటట్టు పరుగు-
కాలే కడుపులో యింత బూడిద
పొయ్యాల్చుని పిల్లల్తో
కట్టు గుడ్డల్తో పరిగెత్తితె
ఏముందక్కడ?
తొక్కిసలాటలో నలిగి చితికిపోయిన
పిల్లల పెద్దల శవాలు హాహాకారాలు
ఇదీ బ్రతుకు దృశ్యం-
ఎంత తరిచి చూసినా
ఈ జీవిత పరమార్థమేమిటనేది
శంకరాచార్యులు చెప్పడు
జిడ్డు కృష్ణమూర్తి చెప్పడు
శూన్యవాదమే కాదు ఏ ఆలోచనా
ధార విప్పి చెప్పదు.
యుగయుగాల నుంచీ
ఆలోచిస్తున్న మనిషి
ఇంకా బ్రతుకు గుమ్మం దగ్గరే
నిలబడ్డాడుగాని
జీవితపు అంతరాంతరాల్లోకి
చొచ్చుకొని పోలేక పోతున్నాడు.

-భూషి కృష్ణదాసు

పాత జ్ఞాపకాలతో ఆమె మనస్సంతా కెలికినట్లయ్యింది!

ఆ తర్వాత అతన్ని ఆమె ఎంత మాత్రం క్షమించ లేకపోయింది. రఘు క్షమించమని వేడుకున్నా కూడా! మరో రెండు నెలలకు ఆమెకు ఇంజనీరింగ్ కాలేజి సీటు రావడం, తండ్రికి ట్రాన్స్‌ఫర్ కావడంతో వాళ్లా ఊరే వదిలేసారు!

"మళ్లీ ఇన్నాళ్ళకు. తను పనిచేసే ఆఫీసులో రఘు కూడా పనిచేయడం యాధృచ్ఛికం కాకపోతే మరేమిటి?" ఎలా ఉన్నాడో? ఏమన్నా మారాడో లేదో!" అనుకుంది సుమలత!

❖ ❖ ❖

మర్నాడు ఆమెకు స్టాఫ్ ఇచ్చిన చిన్న టీ పార్టీలో రఘుని చూసింది! రఘు కూడా సుమలతని చూసి ఆశ్చర్యపోయాడు!

"సుమా! గుర్తున్నానా!" అతనే పలకరించాడు! అరిటాకు రంగు చీర, అదే జాకెట్టు షిఫాను చీరలో అతని కళ్లకు మనోహరంగా ఉందామె!

సుమ పెదాలపై చిరునవ్వు మెరిసింది తళుక్కున!

"రఘు! నిన్ను మరిచిపోతానా!"

అతని మనస్సు ఆనందడోలికల్లో ఊగింది! "అత్తయ్య, మామయ్య ఎలా ఉన్నారు?" అన్ని వివరాలు అడిగింది!

అందరి అక్కయ్యలు పెళ్ళిళ్లు అయి సెటిల్ అయ్యారని చెప్పాడు రఘు! "నేనే ఇంక సెటిల్ అవ్వాలి" చిన్నగా నవ్వాడు!

## మార్పు

అపరిణత ఆలోచన
బాహ్యంగా క్రియారూపంలోకి
స్వేచ్ఛగా ప్రయాణించబడినపుడు
కదలిక ప్రారంభమవుతుంది.
ఎక్కడో రూపాన్ని సంతరించుకున్న సజీవ ఊహ
అంతరాంతరాల్లోంచి
కొత్త చిగురులు వేస్తుంది.
రెమ్మతొడిగే మొగ్గలకు
అందమైన స్వప్నాల పూలు కాచినపుడు
వెలుతురు లోలోపల మరింతగా ప్రకాశిస్తుంది.
తుంచలేని ఘటనల లోంచి
నిటారుగా నిలుచుని
చూసే కళ్ళని కాసేపు కదిలించకుండా
మనసుని ప్రశ్నిస్తే చాలు,
జనించే వికాసమేదో హాయిని కలిగించే
అగ్నిని రగిలిస్తుంది.
కొద్ది విరామం తర్వాత
తెరిపారిన నిశ్శబ్దంలోకి వెళ్ళిపోయి
చీకటిలేని పౌర్ణమి నిండు ఆకారాన్ని మార్చుకున్న
పసుపు దృశ్యం జాలువారుతుంది.
జీవిత యాత్ర అతికొద్ది క్షణాల్లో
పెను సంచలనాలకు వేదికగా మారి
మరికొంత లోదృష్టి నుంచి బయటకు నడిచి
వస్తుంది
అది సృజనతో వచ్చిన మార్పు

**–మందాడి గోపీనాథ్**

ఆమెను చూడగానే – అతనికి ఆమెతో గడిపిన సాన్నిహిత్యం, చిన్నతనం అంతా గుర్తుకు వచ్చి అతనిలో ప్రేమ పరవళ్లు తొక్కింది!

"రఘు మంచి రంగు తేలాడు. చక్కటి రంగు ఆకట్టుకునే చిరునవ్వు– చక్కగా సినిమా హీరోలా ఉన్నాడు" అనుకుందామె!

"సుమా! నిన్ను ఇలా కలవడం ఎంత హ్యాపీగా ఉందో!" ఆనందంగా అన్నాడు! ఇంటికి రమ్మని ఆహ్వానించాడు!

"రఘు! రేపు రా! నువ్వే, మా ఇంటికి!" సుమా ఆహ్వానించి వెళ్లిపోయింది.

❖ ❖ ❖

"ఆ రాత్రి మధురభావనలలో అతను ఉక్కిరి బిక్కిరయ్యాడు! సుమ, సుమ!" అంటూ అతని హృదయం పలవరిస్తోంది! నన్ను క్షమించి స్వీకరిస్తుంది అనే ఆశ అతన్ని ఆనందంలో ముంచెత్తింది!

"రఘు" రా "లోపలికి!" సుమ తలుపు తీసింది! పసుపు పచ్చ చుడీదార్‌లో ముగ్ధంగా, ముద్దబంతి పువ్వులా ఉందామె!

"ఇల్లు ఈజీగా దొరికిందా!" కాఫీ అందిస్తూ అడిగింది!

"ఆ" తడబడ్డాడు అతను ఆమెను మైమరిచి చూస్తూ!

"అమ్మా వాళ్లు వచ్చేస్తారు షాపింగుకు వెళ్లారు. అన్నయ్యది వచ్చే నెలలో పెళ్ళి!"

"అలాగా! మరి నీదెప్పుడో!" కొంటెగా అన్నాడు.

అతన్నికంటి చివర్న చూస్తూ! 'త్వరలోనే' అంది!

"అబ్బాయి, ఎవరు?" ఆసక్తిగా అన్నాడు!

"ఇప్పుడే చూపిస్తాను, సరేనా!" నవ్వింది చిన్నగా,

రఘు ముఖంలో సంతోషం నాట్యమాడింది!

సుమలత అతన్నే చూస్తుండిపోయింది! ఎంత ఇష్ట పడింది ఇతన్ని, ఎంత పిచ్చిగా ప్రేమించింది. ఎంతగా ఆరాటపడి తల్లడిల్లిపోయింది. ఎంతగా అవమానపడి కుమిలి కుమిలి ఏడ్చింది!

పదహారేళ్ల వయసు ప్రేమలో స్వచ్ఛత ఉంటుంది! సమర్పణ ఉంటుంది! ఆశ ఉండదు, ఆశించేది అంత కన్నా ఉండదు!

పెళ్లో, సుఖమో, సంసారమో, నగలో – ఎలాంటి కోరికలు ఉండవు! ఇష్టంతో అతనిలో కలిసిపోవాలని, ఏకమైపోవాలని, తనన్నదే మిగలకూడదని ఎన్నెన్ని కలలు, అన్ని తిరిగి, కూలి నేలరాలిపోయాయి. ఇతని ప్రవర్తనలో!

వాళ్ల ఆలోచన్ని భగ్నం చేస్తూ ఒకతను లోపలికి వచ్చాడు! అతన్ని చూడగానే సుమ కళ్లు కాంతిమంత మయ్యాయి.

"రండి! రఘు! ఇతను ప్రభుకేశవ్!" పరిచయం చేసింది! అతను చనువుగా సుమలత పక్కనే కూర్చుటూ,

"రఘు! అంటే మీ ఎదురింటి..." అంటూ ఆగాడు!

సుమలత మౌనంగా బుర్ర ఊపింది!

"ఓ, రఘు! నైస్ టూ మీట్ యు! సుమ, మీ గురించి చాలాసార్లు చెప్పింది!" అంటూ కరచాలనం చేసాడతను!

రఘు కూడా హుందాగా చేయి అందించి,

'మీరేం చేస్తారు' అనడిగాడు!

"నేను ఎంటెక్ చేసాను, పిఎస్ఎల్ ఇండస్ట్రీ ఎండిని!"

"ఈ మధ్యనే మార్కెట్‌లోకి షేర్స్ కోట్‌చేసిన కంపెనీ మీదేనా?" ఆశ్చర్యంగా అన్నాడు రఘు!

చిన్నగా తలూపాడు ప్రభు!

"మీరింత చిన్నవయస్సులో అంత పెద్ద కంపెనీ పెట్టారంటే నిజంగా చాలా సంతోషంగా ఉంది! మిమ్మల్ని కలవడం!" రఘు అన్నాడు!

'దానికి ఇన్స్పిరేషను సుమలతే, తనే లేకపోతే కంపెనీ పెట్టేవాడిని కాదు, పిఎస్ఎల్‌లో పేరు ఆమె పేరే!"

"అబ్బా! ప్రభూ! మరీ పొగడ్తలెక్కువయ్యాయి మీకు!" కోపాన్ని అభినయించిందామె!

"కాబోయే భార్యని ముందే మంచి చేసుకుంటే మంచిదని" భుజాల్ని ఎగరేస్తూ కొంటెగా అన్నాడతను!

పువ్వులా నవ్వేసింది సుమ!

రఘు నివ్వెరపోయాడు! ఒక క్షణంలో అతని ఊహా చిత్రం నేల కూలిపోయిందనిపించింది! సుమ అందని ఆకాశం – అతనికి అర్థమైంది!

తేరుకుంటూ

"కంగ్రాట్యులేషన్స్!" అన్నాడు చిరునవ్వుతో!

"మీరిద్దరు మేడ్ ఫర్ ఈచ్ అదర్‌లా ఉన్నారు?"

వెళ్లేముందు అన్నాడు!

"థాంక్సు! మిస్టర్ రఘు! సుమ మాట్లాడే ప్రతీ రెండు మాటల్లో మీ ప్రస్తావన తప్పక ఉంటుంది. నాకనిపిస్తుంది మీరు ఇంకో నాలుగేళ్ళు కలిసి ఉంటే, ఈ అపురూపమైన వజ్రం నాకు దక్కేది కాదేమో! అని!" అన్నాడు ప్రభు నిజాయితీగా!

అతని మాటల్లోని భావానికి కదిలిపోతూ,

"ఇంక నాలుగేళ్లు కాదు! నలభై ఏళ్లన్నా సుమకేం కావాలో సుమకే తెలుసు! వజ్రం సరి అయిన కిరీటానికే అమిరింది!" అనేసి రఘు భారంగా వెళ్లిపోయాడు!

అతని వెళ్ళిన వైపే అలాగే చూస్తూ – ప్రభుని ఆనుకుని ఉండిపోయింది సుమ!

'సుమ!" ప్రభు అన్నాడు.

"నాకు అతన్ని చూస్తే జాలేస్తోంది! పాపం!" అన్నాడు!

అలలా కదిలి అతని ఎదపై వాలింది సుమ!

"ఒక వ్యక్తిత్వం రాకముందు తీసుకున్న నిర్ణయాలు, ఆలోచనలు ఆ క్షణానికి బలంగా అనిపించినా, అవి పునాదులు లేని భవంతులు లాంటివి! వయసు ఆకర్షణలు, ప్రలోభాలు, ఆత్మహత్యలు – ఇవన్నీ యవ్వనం వేసే నాటు వేషాలు! ఆ స్టేజి కాస్త బేలెన్స్‌డ్‌గా దాటేశాయి! ఇంక ఏ వ్యక్తికైనా ఎదురు ఉండదు!

ఒక పరిపూర్ణమైన వ్యక్తిగా, ఒక స్థిరమైన వ్యక్తిత్వంలో నన్ను మీకు మనస్ఫూర్తిగా సమర్పించుకుంటున్నాను! నా నిర్ణయం తప్పని బాధపడే రోజు రాదని నిన్ను నమ్ముతున్నాను! నా మనసు ప్రక్షాళన చేసుకుని, నిండుగా మీ రూపాన్ని నాలో ముద్రించుకుని స్వచ్ఛంగా మిమ్మల్ని చేరుకున్నాను! నాకిప్పుడు నిశ్చింతగా ఉంది! మృదువుగా అంది కళ్ళలో నీళ్లు తిరుగుతుండగా!

సుమ కన్నీళ్ళు తుడుస్తూ అపురూపంగా దగ్గరకు తీసుకుని, "ఆ దేముడిచ్చిన అద్భుతమైన వరానివి నువ్వు! నా పక్కన నిలబడ్డ స్థానం కన్నా అమూల్యమైనదే లేదే నా జీవితంలో! నా చుట్టు అల్లుకున్న అహ్లాదకరమైన ఆలోచనల కన్నా ఆనందమేది లేదీలోకంలో!" ఆర్ద్రంగా అన్నాడు ప్రభూ!

అనిర్వచనీయమైన ఆనందంతో అతనిలో కరిగి పోయింది సుమలత!

■